

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 19 నవంబర్, 2022 సంచిక : 6

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
సాయి సేవక్-శ్రీ శివనేశన్ .......... 5
శ్రీ సాయి నిత్య పారాయణ .......... 7
శాశ్వత ధర్మగోప్త .......... 10
సాయిభక్త దాసగణు .......... 13
బాలవాణి-పూలవాన .......... 16
గీత యందు అనుష్ఠాన .......... 18
ఈ మాత్రం చేయలేమా? .......... 22
మాతృసంస్థ కబుర్లు .......... 24
పరిప్రశ్న .......... 26
కర్మఫలితాలు .......... 28
'V' FOR VIDYA .......... 30

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



సాయి బంధువులందరికీ శుభాకాంక్షలు.

శ్రీ సాయిబాబా వారు బోధించిన వాటిలో అత్యంత ప్రధానమైనదీ, సర్వమానవ శిరోధార్యమైనదీ 'ప్రేమ'. ఏదైనా ఒక మార్గాన్ని గురించిగానీ, ఒక మహనీయుని గురించిగానీ మనం తెలుసుకున్నామంటే అర్థం- ఆ మార్గం లేదా ఆ పవిత్రాత్ముడు చెప్పిన బోధనలన్నింటినీ మన జీవితాలలో ఆచరణలోకి తెచ్చుకోవటమే. అలా కానినాడు మనం నేర్చుకున్నది అంతా కేవలం వాచా వేదాంతమై, పరోపదేశానికి మాత్రమే పనికి వస్తుంది. అంచేత స్వయం పరమాత్ములైన సాయిదేవుల వారి 'ప్రేమ' మార్గాన్ని మనం నిర్మలమైన చిత్తశుద్ధితో (నిజాయితీతో) స్వీకరించాలి.

ఇంతకీ 'ప్రేమ' అంటే ఏమిటి? తన సొంత యిష్టాయిష్టాలనూ, తనదైన పరిధినీ, అహాన్నీ త్యజించి తాను ప్రేమిస్తున్న వారి పరిధిలోకి యిమిడిపోవడమే. లౌకిక దృష్టిలో 'ప్రేమ' అనే దానికి ఇంత విస్తృతార్థం లేదు. కానీ, యధార్థమైన అర్థం యిదే.

'ఎదుటివారు ప్రేమిస్తేనే నేను వాళ్లను ప్రేమిస్తాను. వాళ్ళు నేను చెప్పినట్లు - లేదా నేను అనుకున్నట్లు ప్రవర్తిస్తేనే నేను ప్రేమిస్తాను. నా ప్రేమకు ప్రతిఫలం ఉండాలని కోరుకుంటాను" - ఇవి సాధారణంగా మన ప్రేమలో కన్పించే దోషాలు. వీటికి అతీతమైనదే స్వచ్ఛమైన - అచ్చపు ప్రేమ - అదే సాయి బోధించింది.

నిత్య జీవితంలో మనం రకరకాల వ్యక్తులతో సంచరిస్తుంటాం. కలిసి జీవిస్తుంటాం, కలిసి పని చేస్తుంటాం. ఆయా వ్యక్తులందరూ కనీసం మన ఇంటి వాళ్లందరూ, మన పిల్లలందరూ మన కొలబద్దల మేరకే

ఉండాలని ఆశిస్తాం. వాళ్ల అలవాట్లుగానీ, ఆహార విహారాలుగానీ, మాట తీరూ మన్ననలుగానీ మన ఇష్టాఇష్టాల మేరకే ఉంటే బావుంటుందనుకుంటాం. అలా కానినాడు వాళ్ల మూలంగా మనం చాలా బాధపడపోతున్నట్లూ, వాళ్లకు మన పట్ల ప్రేమ లేనట్లూ భావిస్తాం. ఒకవేళ వాళ్ళు కూడా మనను గురించి అలాగే ఆశించి, అలాగే భావిస్తే? ఘర్షణలు, కోపాలు, ద్వేషాలు తప్పవు. అలాకాక - మన ప్రేమ ఎదుటి వారి నుంచీ దేన్నీ ఆశించని స్వచ్ఛమైనదైతే? వాళ్ళ ప్రవర్తన ఎలా ఉన్నా మనం ప్రేమించగలం. వారి విధానాలలో ఏదైనా చెడు ఉంటే దాన్ని సరి దిద్దడానికి ప్రయత్నిస్తాం. అదీ ప్రేమతోనే చేస్తాంగానీ- పట్టుదలలకు పోము. వారి లోపాలను అసహ్యించుకోము. చికాకుపడం. ఒక మంచి ఉపాధ్యాయుడు తన తరగతిలోని మొద్దు పిల్లవాడు- లేదా దారి తప్పిన పిల్లవాడితో ఎలా ప్రవర్తిస్తాడో అలా ప్రవర్తిస్తాం. అంటే కర్తవ్యపాలన కోసం వారిని సరిదిద్దే ప్రయత్నం చేస్తామే తప్ప అందులో స్వార్థంగానీ, అహంగానీ ఉండవు. ఒకవేళ శిక్షించవలసిన అవసరం కలిగినా ఒక జడ్జి నేరస్థుడిని శిక్షించినట్లు నిర్లిప్త భావంతో శిక్షిస్తామే తప్ప అందులో కసీ, ద్వేషం ఉండవు.

తల్లి తన పాపను ఎత్తుకుంటుంది. పాప అమ్మ చేతుల్లోనుంచీ జారి పారిపోవాలని ప్రయత్నిస్తుంది. వదలలేదని తల్లి జుట్టు పీకుతుంది. మెడలో గొలుసు లాగి తెంపాలని ప్రయత్నిస్తుంది. ముఖం మీద రక్కుతుంది. అయినా తల్లి పాపను బురదలోకి వదలదు. నవ్వుతూనే తన జుట్టు విడిపించుకొంటుంది మంటపెట్టే ముఖం తుడుచుకొంటుంది. "ఎంత కోపం రా నాన్నా నీకు!" అని ముద్దు పెట్టుకొంటుంది. అంతేగానీ, "నన్ను బాధపెడతావా?" అని కోపంతో నేలకు విసిరికొట్టదు. అదీ తల్లి ప్రేమ అంటే. అటువంటి కోమల హృదయాన్ని, స్త్రీ సహజమైన అర్ద్రతను అలవరచుకున్నపుడే మనం అచ్చమైన సాయి భక్తులమని చెప్పకోగల అర్హత మనకు లభిస్తుంది. క్రమంగా యీ ప్రేమే విస్తరిస్తూ పోయి విశ్వప్రేమగా మారే





అవకాశం లభిస్తుంది.

ప్రేమకు, స్త్రీకి అవినాభావ సంబంధం ఉంది గనుక అది అందరికీ రాదేమోనన్న సంశయం మనకు అక్కరలేదు. ప్రతి పురుషుడిలోనూ ఒక సుకుమారస్త్రీత్వం ఉంటేనే వాడు మనిషవుతాడు. లేకపోతే రాక్షసుడవుతాడు. అలాగే ప్రతి స్త్రీలోనూ ఒక దీక్ష, వేడి ఉంటేనే చైతన్యమూర్తి అవుతుంది. లేకపోతే వానపాము తంతే. అంచేత ప్రతి సేవకుడిలోనూ కోమలమూ, సుస్థిరమూ అయిన ప్రేమ భావన ఉండి తీరాలి.

మరి ఇంతకీ యీ ప్రేమకు కొలమానం ఏమిటి? త్యాగం. త్యాగం లేనిచోట ప్రేమ ఉండటం కేవలం భ్రమ. పాప జుట్టు పీకుతున్నపుడుగానీ, ముఖాన రక్కుతున్నపుడుగానీ తల్లిలోని క్రోధం తలెత్తుతుందా? లేదే! ఎందుచేత? ఆమె పాపాయి స్థాయి కంటే చాలా ఎత్తున నిలిచి, పాపాయి మీది ప్రేమతో తనలోని క్రోధాన్నీ, అహాన్నీ త్యజిస్తుంది. ఒక ఇంట్లో ఒకరిద్దరికి సరిపడే ఆహారమే ఉన్నదనుకుందాం. అప్పడు ఆ ఇంటి ఇల్లాలు ఆ ఉన్న దాన్ని తన భర్తకూ, పిల్లలకూ పెట్టి తాను పస్తు పడుకోవడానికి సిద్ధపడుతుంది గదా? అదే విధంగా ఎదుటి వారిని బాగుచెయ్యడానికిగానీ, వారికి కావలసిన సహకారం ఇవ్వడానికిగానీ మన సౌకర్యాలను, మన అహంకారాలను, మన వ్యామోహాలను త్యజించగలిగినప్పడే మనం సేవా మార్గానికి అనువైన ప్రేమను సంతరించుకోగలం. సత్యమైన సహానుభూతిని చూపగలం. అలాకాక, మనలోని ప్రేమ స్వచ్ఛమైనది కానపుడు మన సాయీ భక్తి సేవా దృక్పథం యివన్నీ అందమైన ఆత్మవంచనలు మాత్రమే అవుతాయి. అందుచేత యీనాడు త్రికరణశుద్ధిగా సాయినాథుల వారి ముందు తలవాల్చి, ప్రతిఫలాపేక్ష లేని నిర్మలమైన షరతులు, అవధులు ఎరుగని అనంత ప్రేమభావనను మన హృదయాలలో నింపుకొనే ప్రయత్నం చేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం-ప్రేమతోనే లోకాన్ని జయిద్దాం. "మాయబోకు దయాద్వారం - ఆరనీకు ప్రేమదీపం" అన్నది మన మంత్రంగా మలుచుకుందాం.

సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

(గత సంచిక తరువాయి)

మహారాష్ట్ర కీ పావన భూమి ఇసకో కోటి ప్రణామ్ హై
ఇనకీ మాటీకే కణకణమే లిఖా తుమ్హారా నామ హై
తేరే మందిర్ మే ఆతేతో దునియాసే క్యా కామ్ హై
షిరిడీ హమారా బృందావన హై షిరిడీ గోకుల ధామ్ హై
సాయి హమారే కృష్ణ కన్హైయా, సాయి హమారే రామ్ హై
సాయి బాబాకే చరణోమే చారోం ధామ్ హమారే హై ॥ హరి ॥

## అబ్‌సోంప్ దియా

అబ్ సోంప్ దియా ఇన్ జీవన్ కా సబ్ భార్ తుమ్హారే హాథోమే
సాయినాథ్ తుమ్హారే చరణోమే
హై జీత్ తుమ్హారే హాథో మే ఔర్ హార్ తుమ్హారే హాథోమే
సాయినాథ్ తుమ్హారే చరణోమే ॥ అ ॥
మేరా నిశ్చయ బస్ అబ్ ఏక్ యహి ఏక్ బార్ తుఝె పాజాఊఁ! మై
అర్పణ కర్ దూం దునియా భర్‌కా సబ్ ప్యార్ తుమ్హారే హాథోమే
సాయినాథ తుమ్హారే చరణోమే
యది మానవకా ముఝె జనమే మిలేతో తబ్ చరణోంకా పూజారి
బనూ
ఇన్ పూజక్ కే ఇక్ ఇక్ రగ్‌కా హెూ హార్ తుమ్హారే హాథోమే
సాయి నాథ్ తుమ్హారే చరణోమే
ముఝుమే తుఝుమే బస్ భేద్ యహీ మై నర్ హు తుమ్ నారాయణ్ హెూ





మై హుం సంసార్ కే హాథోమే సంసార్ తుమ్హారే హాథోమే
సాయి నాథ్ తుమ్హారే చరణోమే
హమ్ తుమ్ కో కభీ నహీ భజతే ఫిర్‌భీ తుమ్ హమ్‌కో నహీత్యజతే
అపకార్ హమారే హాథోమే ఉపకార్ తుమ్హారే హాథోమేం
సాయినాథ్ తుమ్హారే చరణోమే

## షిరిడీ కే సాయి బాబా

షిరిడీ కే సాయి బాబా తేరీ దుహాయి బాబా!
తేరే శరణ హమ్ ఆగయే !
వోసాయి హమ్‌తో జనమ, జనమ కాఫల్ పాగయే!
జోభీ ఆయే సబ కుఛ్ పాయే, తేరే నిర్మల ప్యార్‌మే!
వో మన్ మోహక్ మురత్ వాలే, తుమ్ సబసే హెూ నిరాలే!
దీన దయాళూ హమ్ ఆగయే ॥ షి ॥
నా మాంగే హమ్ హీరే, మోతీ, నా చాందీ నా సోనా!
హమే తుమ్హారీ కృపా చాహియే, ఔర్ హృదయకా కోనా!
హమ్‌కో హాథ్ దయా కాదేనా, అపనీ ఛాయా మేలేనా!
లీలా తుమ్హారీ జాన్ గయే

## సాయినాథ్ తేరే చరణోంసే

సాయినాథే తేరే చరణోంసే హమ్ కో న జుదా కరనా ॥ సా ॥
జబ్ యాద్ తేరీ ఆయె మిలన్‌కీ దయా కరనా
నా మై తాపసీ నా జ్ఞానీ, నా మై యోగీ నా ధ్యానీ
తూ మాత పితా మేరా మే హుం బాలక్ అజ్ఞానీ
సాయి మేరే దోషోంపర్ మత్ ఖయాల్ కియా కర్‌నా ॥ సా ॥
ఫంస్ కే జగ్ మాయామే జో మై కభీ భరమాం జాఊం
జో భూల్ తుఝె సాయిజీ ఖోటె రస్తే చలా జాఊం
తో వేగ్ సాయిజీ ఆకె మెహథామ్ లియా కరనా ॥ సా ॥

(సశేషం)

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

కం. సాధన కతమున సాధ్యము
సాధించగ జన్మ రహిత సాయుధ్యములన్
సాధన కొఱకై కాయం
బాధారంబగు టెఱింగి యపాయము గాయుమ్. 8

తే.గీ. ఇంద్రియములను నిర్జించి యీశు దలఁచి
మంచి-చెడ్డల దెలిపెడి మార్గమెరుగ
సాధనంబున సాధ్యము సన్నిహితము
మనుజ జన్మకు సార్థకమగును గాదె. 9

కం. బాబా సంగతి పడుకొని
బాబాతో కలసి మెలసి భక్తితో యుంటూ
బాబాతో చర్చించగ
బాబా కృప గలుగు గాదె భాగ్యము నందున్. 10

తే.గీ. తాత్యకు, మహల్సకును గల్గె దరికి జేర
సాయితో నిదురించగ సమత గల్గె
భాగ్య మేమందువారిది! భక్తిపరులు!
ముక్తినొందగ సాయియే శక్తినొసగె. 11

తే.గీ. సాయి యాజ్ఞ మీరగ రాదు సాగిపోవ
ఆనతి గైకొన్న పయనంబు అచ్చి వచ్చు





కాదు కూడదనుచు బోవ కష్టమొచ్చు
సాయి సర్వేశుడనుటకు సాక్ష మిదియ. 12

## 15. బాబ యానతి గైకొన్న

ఆ.వె. పయన మయ్యె తాత్య వలదన్న వినకుండ
మధ్యమార్గమందు బండి కూలె
యుండ మన్న వినని యూరోపియనుకును
నడుమ మార్గమందు నడ్డి విరిగె. 1

తే.గీ. బాబయానతి గొనకుండ బయలుదేర
వచ్చు విపరీత కష్టాలు వలదు పోవ
బాబ యానతి గైకొన్న భయము లేక
బాట సుగమము సుఖమగు పయనమున్న. 2

తే.గీ. పంచ సూనాలు పోగొట్టి మంచిజేయ
సాయి నాధుడు భిక్షకు చేయిజాపు
భాగ్యమమరెను శిరిడీన భక్తజనుల
పరమశివునకు భిక్షను భక్తి నొసగ. 3

తే.గీ. మిట్ట మధ్యాహ్న సమయాన యిండ్లవెంట
భిక్ష గొనిరాగ నరుగును బిడియ పడక
శిరిడివాసుల పాపాలు ఛిద్రమవగ
సాయి పరమేశు శిరిడీన సంచరించు. 4

కం. కదలక మెదలక యుండియు
నుదరము లోపల జగముల నుంచిన బాబా

పదనుగ జరిగెడు వన్నియు
యిది యది యనకుండ నెఱుఁగు యెల్లలులేకన్. 5

కం. కుక్కకు రొట్టెను బెట్టిన
మిక్కుటముగ సంతసించి మెచ్చెను యామెన్
మక్కువతో అన్నార్తుల
యిక్కట్లను బాపు మనుచు యిమ్ముగ బలికెన్. 6

తే.గీ. కుక్క యాకలి దీర నా కుక్షినిండె
ప్రాణులన్నిటి యాత్మల బఱగు వాడ
ఆర్తి దీర్చుము ప్రాణుల నాదరమున
యనుచు తర్ఖడు భార్యతో ననియె సాయి. 7

కం. ఇంటను పూజను మరువగ
వెంటనె తర్ఖడు సతికిని వెలితిని దెలిపెన్
కంటికి రెప్పై నిలచును
మంటిన మింటిన జరిగెడు మహిమలు తానై. 8

ఆ.వె. సకల జనుల రక్ష సాయి చేయుచునుండు
సాయి! యనగ నీవు-ఓయి! యనును
కష్టములను దీర్చ కరుణాంత రంగుడు
స్మర్తుగామి సాయి సాగివచ్చు. 9

ఆ.వె. అన్న దానములను యలసట యనకుండ
వండి తానె జేయు వడ్డనమును
అన్నపూర్ణ సాయి ఆకలి దీర్చంగ
పరమ శివుడు దానె పరము నొసగ. 10

**(సశేషం)**





శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



**- రచన : భండారు సదాశివరావుగారు**

**(గత సంచిక తరువాయి)**

ప్రాగ్భూమి అంచునుంచి, పశ్చిమ సముద్ర తటం వరకు 'హే కృష్ణ, గోవింద, హరే మురారే హే నాథ నారాయణ వాసుదేవ' నినాదాలతో, కన్నీటిధారలతో, ఉన్మాద భక్తితో సాగిన ఆ యాత్రను చూచి భూదేవి కూడా తన జన్మ సార్థకమైందని అనుకున్నది.

చివరి దళం బయలుదేరగానే శ్రీకృష్ణుడు తన రథాన్ని సమాయత్త పరచమని దారకునికి చెప్పాడు. చిత్రవాహనుడు కూడా సెలవు తీసుకున్నాడు. ప్రాగ్జోతిషంలో ప్రజల జీవనం సవ్యంగా నడుస్తున్నది. శ్రోత్రియులు తమ ధర్మకర్మలను ప్రారంభించారు. విచిత్రమేమంటే నరకుని మరణం జరిగి ఒక నెలకాగానే నగరంలో పరిసర గ్రామాలలో ఇండ్లకు సున్నాలు వేయించుకున్నారు. ద్వారాలకు తోరణాలు కట్టుకున్నారు. ప్రాంగణాలను రంగవల్లికలతో అలంకరించుకున్నారు.

శ్రీకృష్ణుడు మార్గశిర పూర్ణిమ రోజున బయలుదేరాడు. క్రితం రాత్రి ప్రాగ్జోతిషం జ్యోతిర్మయంగా వెలుగొందింది. ఇంటింటా దీపాలు వెలిగాయి. నగరమంతా కృష్ణ నామస్మరణతో నిద్రలు లేకుండా గడిపింది. ప్రభువు ఆ రోజు తిరిగి ద్వారకకు బయలుదేరనున్నాడు.

ముందుగా విముక్తలైన స్త్రీలు ప్రయాణించిన బాటను తప్పించి శ్రీకృష్ణుడు దగ్గర దారిలో ప్రయాణమైనాడు.

భూదేవికి సాధువాదాలు పలికి, శుభాకాంక్షలు స్వీకరించాడు.

భగదత్తుడు కృతజ్ఞతాభారంతో నేలలోకి కుదించుకుపోయినాడు. 'ప్రభూ! నాకు ప్రాణదానం చేసి, రాజ్యమిచ్చి, ఈ ప్రాంతాన్ని నీ పాదస్పర్శతో

పావనం చేశావు. మా నాయనగారు చేసిన పాపాలకు ఆయన పరిహారం చెల్లించుకున్నారు. మీకు ఏమి ఇచ్చుకోగలం ప్రభూ!' అంటూ తన రాజ దంతావళం సుప్రతీకను బహూకరించాడు.

'భగదత్తా! సుప్రతీక రాజ్య గౌరవచిహ్నం. అది ఇక్కడే ఉండాలి'.

'భగదత్తుని బలవంతం మీద సుప్రతీకను కృష్ణ, సత్యభామలు అధిరోహించారు. ముందు భగదత్తుడు, రాజ పరివారం, అమాత్యులతో నడిచారు. వారికి ముందు శ్రోత్రియులు ఉచ్చైస్వరాలతో వేదం పఠిస్తూ ఆశీస్సూక్తులు పలికారు. ప్రజలిరువైపులా నిలిచి 'హే కృష్ణ గోవింద హరే మురారే, హే నాథ నారాయణ వాసుదేవ' అని గానం చేసారు.

ప్రాగ్జోతిషం వైకుంఠధామమైంది. అలా పొలిమేర మేరకు వీడ్కోలు ఊరేగింపు సాగింది.

సాత్యకి ప్రభృతులు నరకాసురుని కథను, పదహారు వేల మంది అబలలను నరకుని చెర నుండి విడిపించిన అద్భుత చర్యను తను ప్రయాణపు దారిలో విన్విస్తూ ద్వారకకు చేరారు. అప్పటికే సత్యభామా, కృష్ణుల అద్భుత సాహసగాథ ద్వారకకు చేరింది. క్రమంగా విముక్త నారీ బృందాలు ప్రభాసకు చేరుకోవడం మొదలైంది.

అద్భుతమేమంటే, సాత్యకి ద్వారకకు చేరి కృష్ణ సందేశం వినిపించడం తోటే ఉగ్రసేనుల వారు సుధర్మలో యాదవ ప్రముఖుల సమావేశం ఏర్పాటు చేశారు. కృష్ణ సందేశాన్ని సభలో వినిపించగానే యువయాదవులు, ప్రౌఢులు, ఉవ్వెత్తున సాధువాదాలు పలికి, ఆ నవ నిర్మాణంలో పాల్గొనే అవకాశం తమకు ఇవ్వమని ఉగ్రసేనులను కోరారు. సత్యభామ సోదరుడు భంగాకరుడు తన కోశాగారాన్నే తెరిచాడు. విద్యుద్వేగంగా పైన నాగనాథం నుండి పనులు ప్రారంభమైనాయి. అక్కడే ఒక సరస్సును నిర్మించడానికి వాస్తుపూజ జరిగింది. స్థలాల గుర్తింపు, కుటీరాల నిర్మాణం ప్రారంభమైంది. ఇది యాదవ చరిత్రలోనే కాదు-మానవచరిత్రలోనే అద్భుతమైన ఘట్టం.





శ్రీకృష్ణుని దయ వల్ల యాదవ గణసంఘం అనితరమైన సేవాకార్యాన్ని భగవత్ ప్రీతికరంగా చేయగలుగుతున్నారు.

ప్రభాసంలో సోమనాథ పరమేశ్వర ధామంలో, కృష్ణస్వామి రాకకు నిరీక్షిస్తూ సర్వ సంపత్కరమైన యాగాన్ని గర్గాచార్యులు మొదలుపెట్టారు. ఆ వార్త ఉపమన్యుల వారికి చేరింది. ఆయన నిలువునా కదలిపోయి పరుగు పరుగున వచ్చారు. 'పరమశివా! లోకరక్షణకు జన్మించిన శ్రీకృష్ణుని సత్సాంగత్యం మా అందరికీ కల్గేట్లు చేశావు తండ్రీ' అని సోమనాథుని ప్రార్థించారు. పదహారు వేలమంది ఆడబిడ్డల సర్వ కళ్యాణ ప్రాప్తి కొరకు ఆహుతులు వ్రేలుతున్నాయి. ఆ యజ్ఞశిఖలలో సర్వదోషాలు దగ్ధమైపోతున్నాయి.


దాదాపు నాలుగు వేల ఇండ్లు ఎనబై చిన్న చిన్న నివేశనాలుగా నిర్మాణమైనాయి. శ్రీకృష్ణుని కొరకు ఆ స్త్రీలు కళ్లలో జ్యోతులు వెలిగించుకొని ఆయన స్మరణే సర్వస్వముగా ఎదురుచూస్తున్నారు.

కృష్ణునికి సత్యకూ ద్వారకలో ఊహాతీతమైన స్వాగతం లభించింది. నరకాసురుని సంహర్త, దీన జనోద్ధర్త, పరమపురుషుడైన లోకభర్త రాకతో ద్వారక కరిగిపోయింది.

దేవకీ వసుదేవుల ప్రేమాలింగనంలో కరిగిపోయినాడు. ఉగ్రసేనుల వారు అవాక్కుగా ఆనందతన్మయుడైనాడు. ఆ రోజుల్లో ఆప్తులగు స్నేహితులను కలుసుకోవడంతోటే సరిపోయింది. సత్యభామను స్త్రీ యాదవ నారీ బృందం సాక్షాత్తు దుర్గగా సంభావించింది. ఎంత స్వోత్కర్ష కలిగిన మనిషి! ఎంతగా ఎదిగింది? ఎంత సత్యభావనా గరిమకు ఆదర్శరూపమైంది.

మాటలో, నడకలో, చూపులో సత్యభామ పూర్తిగా మారిపోయింది. ఆమెకు శ్రీకృష్ణుని దివ్యస్వరూపం ప్రత్యక్షమైంది. తన సర్వస్వాన్ని ఆయన పాదాల దాపున, ఆయన కనుసన్నలకు కైంకర్యం చేసింది. రేవతి, రుక్మిణి, కృష్ణుని మిగతా భార్యలతోపాటు శైబ్య కూడా ఆమెను ఆప్యాయంగా సంస్తుతించింది.

**(సశేషం)**



# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

(గత సంచిక తరువాయి)

విరోధి పక్షం వారంతా ఎలాగయినా సరే, రాధాకృష్ణాఆయిని అపహసిస్తూ దాసగణు వ్రాసిన కావ్యం ముద్రణకు వెళ్ళకూడదనే గట్టి పట్టుదలతో నయానో, భయానో దాసగణుని వారించాలని నిర్ణయించు కున్నారు. అప్పుడు ఆ పక్షంలో అత్యంత ధనవంతుడైన శ్రీ బాపూసాహెబ్ బూటీ దాసగణు వద్దకు వచ్చి "ఒక విషయాన్ని జాగ్రత్తగా గుర్తు పెట్టుకో. ఆ కావ్యాన్ని ముద్రించావంటే రాధాకృష్ణాఆయి తరపున నీ మీద పరువు నష్టం దావా వేస్తాను. దానికోసం ఎంతయినా ఖర్చు పెడతాను. ఉన్నత న్యాయస్థానాలలో చందోర్కర్ పలుకుబడి పనిచేయదు. ఈ విషయాన్ని జాగ్రత్తగా గుర్తుంచుకో" అంటూ తీవ్రంగా హెచ్చరించాడు. శ్రీ బూటీ చెప్పినట్లుగా జరిగే శక్యత ఎక్కువగా ఉండటంతో దాసగణు ఆ కావ్యాన్ని చించివేసాడు. కానీ, విషయాన్ని అంత సులభంగా వదిలేసే వ్యక్తిత్వం దాసగణుది కాదు. అందుకే, చట్టపరిధికి లోబడి పరోక్షంగా ఆమెను విమర్శించే విధానాన్ని దాసగణు ఎంచుకున్నాడు. అదెలాగంటే, ఆ రోజుల లోనే దాసగణు ప్రసిద్ధ సత్పురుషుడైన శ్రీ చాంగ్‌దేవ్ మహారాజ్ జీవన చరిత్రను కీర్తనాఖ్యానంగా వ్రాసే పనిలో ఉన్నాడు. ఆ ఆఖ్యానంలో చాంగ్‌దేవ్ మహారాజ్ వద్ద సేవ చేసుకునే ఒక విధవరాలైన స్త్రీ అనే కల్పానికమైన పాత్రను సృష్టించి, రాధాకృష్ణాఆయి వ్యక్తిత్వాన్ని, వ్యవహారాన్ని ఆ పాత్రకు ఆపాదించాడు. ద్వారకామాయి సభాప్రాంగణంలో బాబా సన్నిధిలో, భక్తులందరూ ఉపస్థితమై ఉండగా కీర్తన చేస్తూ, ఆ పాత్ర గురించిన వ్యాఖ్యానాన్ని మొదలుపెట్టాడు.

పుణ్యస్తంభో కేలా మఠ్ కేశవదాస్ చాంగ్‌దేవానీ!





తైత్యాజవళ్ రహాయా ఆ లీసే ఏక్ బ్రాహ్మణీ తరుణీ!

(శ్రీ కేశవదాస్ చాంగ్‌దేవ్ మహారాజ్ మహారాజ్ పూణె ప్రాంతంలో ఒక మఠాన్ని స్థాపించారు. ఆ మఠంలో నివసించడానికి ఒక బ్రాహ్మణ యువతి వచ్చింది.)

కుంచె కరోని కేశేవా! పంథ్ ఝాడీ సద్గురూ చా !

ఏశీ నిర్వాణీచీ భక్తి! పాహునీ బోళే ఆనందతీ !

పరీ చాంగ్‌దేవ్ మనీ! యేయీ తిట్ కారా క్షణోక్షణీ !

గణూ మాణే గారే ప్రత్! పార్ఖీకా వాఖాణీత్ !

(కేశాలనే చీపురుగా చేసి, సద్గురు నడిచే మార్గాన్ని శుభ్రం చేస్తుంది. అటువంటి దృఢ భక్తిని చూసి, సాధారణ భక్తులు ఆనందించేవారు. కానీ, చాంగ్‌దేవుని మనసులో అనుక్షణం తిరస్కారం ఉత్పన్నమయ్యేది. దాసగణు అంటున్నాడు 'సుందరమైన గాజుముక్కకు వజ్రనిపుణుడు విలువనిస్తాడా")

సాధుపురుషా సంతాప్ కసాయెతో !

కాయ్‌కేముదీ పశూన్ తాప్ హోతో !

అసే వదతీ జన్ బఘూని చాంగేయాలా !

కుణీన బగతీ త్యాతీల్ ఇంగితాలా ॥

(సత్పురుషులకు కోపం ఎలా వస్తుంది. ఇదేమిటి వెన్నెల నుండి వేడి పుడుతుంది? అని భోళా భక్తులు భావిస్తారు. కానీ, మరలా అందులోని అంతరార్థాన్ని చూడరు.

శవటీ అతి ఝాలే, త్యావేళీ కహీ విచారవంత్ మండలి

ఏకత్ర్ ఝాలీ తే బాయీస్ మ్హణాలే

(చివరకు ఆమె చాలా అతి చేయసాగింది. అప్పుడు కొందరు ఆలోచనాపరులు ఒక్కటై, ఆ స్త్రీతో ఈ విధంగా అన్నారు.)

తూ విగతధవా బ్రాహ్మణీ సకేశ ఖరీ !

ఆహాస్ తరుణ్ త్యాతునీ నకో రాహు మఠాభాతరీ !

నేశశీ ధవళ్ పాతళా విరక్తపరీ !

(భావం : పొడవైన కేశాలు కలిగిన విధవరాలివి. అందులోను యువతివి! అందువలన మఠంలో వుండవద్దు. నీవు పలుచటి తెల్లని చీరను ధరించి తిరుగుతున్నావు. నీవు సువాసనల తైలాన్ని కేశాలకు పూస్తావు, ఆ కేశాలలో సుగంధభరితమైన పూలు పెడతావు)

హెూఈస్ తేత్ వాసాబే, బుచడ్యాత్ సుమన మంజరీ !

మన్‌గటీ మణీ తులశీచే, తువా బాందిలే !

డళ్‌డళీత్ తసే నిజ్ బాళా వైష్ణవి చిహ్న రేఖలే !

చాపలతా తుజ్యా అంగీచీ, అలౌకిక ఖరీ !

శృంగార రూప మేఘాచీ, తూ మాన్మంధాంబరీ !

(భావం : నీవు మణికట్టుకు తులసీమాల ధరిస్తావు. నుదుటిపై వైష్ణవ చిహ్నాన్ని ధరిస్తావు. నీవు చాలా హుషారు అయిన దానివి ఆకాశంలో మేఘాలలో మెరుపు వచ్చినట్టు నీవు మనసులో శృంగార భావాన్ని ఉత్తేజపరుస్తావు.)

కృష్ణాచీ మూర్తీతీ కరీ! ధరిలీత్యాం జరీ !

పరి నతీ ఖరీ ! డోంగ్ తే బాళే, సమన్‌లో అహ్మీ అంతరీ !

వాచీశీ భారత్ భాగవతా ! భోళే పాస విద్యా !

నకో రాందూ, ముఖీ చ్యా దంత్, త్యా కళతీ వాళూచ్యా కణ్యా !

(భావం : చేతిలో కృష్ణుని మూర్తిని పట్టుకున్నావు, కానీ భక్తితో కాదు ఇదంతా నీ నాటకం అని మేము తెలుసుకున్నాం. భాగవతాన్ని, మహా భారతాన్ని పారాయణం చేసి అమాయకులైన భక్తులకు వల వేస్తావు. నాటకం వద్దు. నోటిలో దంతాలు కలిగిన వారికి అన్నం బియ్యంతో చేశారో, ఇసుకతో చేశారో అర్థం అవుతుంది.)

**(సశేషం)**





బాలవాణి

# పూలవాన

– అమ్మ

మన పవిత్ర భారతదేశం ఒకప్పుడు చాలామంది త్యాగశీలురికి నిలయంగా ఉండేది. అందుచేత ప్రపంచంలోని యితర దేశాలన్నీ భారత దేశాన్ని ఆదర్శంగా తీసుకునేవి. మన దేశం అనుసరిస్తున్న ధర్మాన్నే పాటించి ప్రపంచమంతా బాగుపడటానికి ప్రయత్నిస్తున్న రోజులవి.

ఆనాడు కూడా అక్కడక్కడా అధర్మపరులు లేకపోలేదు. మరి ధర్మం తప్పితే దేవుడు ఊరుకుంటాడా? వానలు కురవటం మానేసినై, వానలు కురవకపోతే మరి పంటలు పండవు కదా? పంటలు పండకపోతే తిండి దొరకదు కదా. తిండి కాదు దాహం తీరటానికి నీళ్ళు లేవు. ప్రజలు తిండి లేక, నీళ్ళు లేక అల్లాడిపోతున్నారు. ఇలా ఒక సంవత్సరమో, రెండు సంవత్సరాలా? ఏడాది వెంట ఏడాది పన్నెండేళ్ళు గడిచిపోయినై. పోయిన వాళ్ళు పోగా మిగిలి వాళ్ళ హాహాకారాలు అంతటా వ్యాపించినై. ఎండి పగుళ్ళ చూపిన నేల, కుళ్ళిపోతున్న మనుషుల, పశువుల శవాలతో నిండి పోయింది. ఎటు చూసినా తిండిలేక మలమల మాడిపోతూ చావుకు సిద్ధమౌతున్న మనుషుల ఏడుపులే వినిపిస్తున్నై. రాజుల దగ్గరా, ధనికుల దగ్గరా ఎంత డబ్బు ఉంటే మాత్రం ఏం లాభం. నిలవ చేసిన తిండిగింజలన్నీ అయిపోయాయి. బస్తాడు బంగారు నాణేలు యిస్తామన్నా చేరెడు బియ్యం గింజలు కూడా దొరకటం లేదు.

ఈ కరువు పోగొట్టటానికి ఏదైనా ఉపాయం తీవ్రంగా ఆలోచించాలని ఆ మిగిలిన వాళ్ళంతా ఒకచోట సమావేశమైనారు. మేధావులంతా ఆలోచిస్తున్నారు. పండితులు శాస్త్రగ్రంథాలు తిరిగేస్తున్నారు. మిగతా జన మంతా తమను ఈ ఆపద నుంచి రక్షించే ఉపాయం చూపించమని

భగవంతుని ప్రార్థిస్తున్నారు. చివరికి ఒక ముసలి పండితుల వారికొక పరిష్కారం దొరికింది. ఆ గ్రంథాల్లో వానలకు దేవుడైన వరుణ దేవుణ్ణి, దేవతల రాజు ఇంద్రుణ్ణి యజ్ఞం ద్వారా సంతోషపెట్టాలి. కానైతే ఆ యజ్ఞంలో ఒక ప్రత్యేకత ఉంది. ఒక బుద్ధిమంతుడైన కుర్రవాడిని బలిఈయాలి. వాడిని బలవంతం చేయకూడదు. తనంత తానుగా ఇష్టపడి ముందుకు రావాలి. అందరికీ తమ ప్రాణమంటే చాలా తీపిగదా! "నన్ను చంపండి" అని ఎవడు ముందుకు వస్తాడు? పండితులు అడిగారు. ఎవరైనా బలిపశువుగా యిష్ట పడితే యజ్ఞం చేద్దాం, వానలు కురిసి, కరువు తీరుతుందీ - అని. అంతా నిశ్శబ్దం. అందరికీ వానలు కురవటం కోసం యజ్ఞం చేయించాలనే ఉంది. కానీ, ఎవరికి వారు ఇంకెవరైనా బలికావటానికి సిద్ధపడితే బాగుంటుంది-అని ఎదురుచూస్తున్నారే కాని తాము మాత్రం లోకం మేలు కోసం చావటానికి ముందుకు రావటం లేదు.

కొంతసేపు అలా అందరూ మౌనంగా ఉన్న తరువాత హఠాత్తుగా ఒక పదిహేనేళ్ళ కుర్రవాడు లేచి నిలబడ్డాడు. పెద్ద పెద్ద కళ్ళతో సుకుమారం గానూ, అందంగానూ ఉన్నాడు. చూడగానే మంచి బుద్ధిమంతుడు, తెలివి గలవాడూ అని తెలుస్తుంది. అందరూ తలలు తిప్పి అతనివైపే చూస్తున్నారు. గంభీరమైన గొంతుతో పెద్దలందరికీ నమస్కారాలు చెప్పాడు. "అయ్యా ప్రజల మేలు కోసం నా ప్రాణాలు ఆనందంగా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు, అందరూ ఆనందంతో తబ్బిబ్బయ్యారు, కొందరు పెద్దలు మాత్రం చావుకు సిద్ధపడుతున్న ఆ చిన్న కుర్రాడిని చూసి జాలిపడ్డారు.

ఇంతలో ఒక ఋషి తాను కూర్చున్న చోటు నుండి లేచి గబగబా ఆ పిల్లవాడి దగ్గరకు వచ్చి ప్రేమతో కౌగిలించుకున్నాడు. "నాయనా! నీ వంటి వ్యక్తులే దేశానికి గర్వకారణం. తన కోసమే తాను బ్రతికేవాడు. ఊరూపేరూ లేకుండాపోతాడు. ఇతరుల కోసమే బ్రతికే నీవంటి త్యాగధనుల బ్రతుకే నిజమైన బ్రతుకు. నీ కీర్తి ఎల్లకాలమూ ఈ లోకంలో నిలిచిపోవాలని





ఆశీర్వదిస్తున్నాను" అని ఆనందభాష్పాలతో ఆశీర్వదించాడు. అలా ధైర్యంగా ముందుకు వచ్చిన ఆ బాలుడే శతమన్యుడు. విచిత్రమేమిటంటే ఆ బాలుడిని సంతోషంగా మెచ్చుకున్నవాడెవరో కాదు - ఆ బాలుని తండ్రే. ఆ తండ్రీ కొడుకుల త్యాగం దేవతలను కూడా ముగ్ధుల్ని చేసింది. యజ్ఞంతో అవసరం లేకుండానే కుండపోతగా వాన కురిపించారు. శతమన్యుని పైన పూలు కూడా కురిపించారు. కరువు తీరింది. శతమన్యుని త్యాగశీలాన్నీ, అటువంటి మంచి కుమారుడిని కని దేశ సేవ కోసం ప్రోత్సహించిన ఆ తండ్రి సద్గుణాన్నీ జనం వేనోళ్ళ మెచ్చుకున్నారు.

నాయనలారా! ఇదీ మన భారతదేశ సంప్రదాయం? నేటి బాల బాలికలు గూడా లోక కళ్యాణం కోసం కొంతైనా తోటి వారిని గురించి ఆలోచించటం నేర్చుకుంటే మళ్ళీ మన దేశానికి కీర్తిప్రతిష్ఠలు రావా!

# గీత యందు అనుష్ఠాన ప్రాధాన్యము

**- పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామీ విద్యా ప్రకాశనందగిరి వారు**

సిద్ధాంతములను ఏకరువు పెట్టుటకంటే అనుష్ఠానమును నొక్కి చెప్పట గీతాచార్యునకు పరమప్రీతి. కనుకనే సాధ్య వస్తువగు పరమాత్మను గూర్చి ఒకింత మాత్రమే తెలియజేసి, ఆ పరమాత్మను జేరుటకు వలసిన సాధన సంపత్తిని విస్తారముగ గీత యందు ప్రకటించెను. రెండవ అధ్యాయమందలి స్థిత ప్రజ్ఞ లక్షణములు, ఆరవ అధ్యాయమందలి యోగాభ్యాస పద్ధతి, పండ్రెండవ అధ్యాయమందలి భక్తుని లక్షణములు. పదమూడవ అధ్యాయమందలి జ్ఞాన గుణములు, పదునారవ అధ్యాయమందలి దైవీ సంపద్వివరణ, మున్నగునవియే ఇందులకు తార్కాణము. సిద్ధాంత ప్రతిపాదన కంటే అనుస్ఠాన నిర్వహణయే చాలా గొప్పదని ఇట్టి

బోధనల ద్వారా భగవానుడు తెలియజేయుచున్నాడు. గీతా గ్రంథము తెరవగనే మొట్టమొదట ఈ సత్యము కండ్లకు కట్టినట్లు పాఠకునకు అగుపడగలదు. నైతిక పతనము గల వానికి ఆధ్యాత్మిక సూత్రములు హృదయమున ఎన్నటికిని ప్రవేశింపజాలవు. చిత్తశుద్ధి లేని వానికి జ్ఞానము ఒంటపట్టదు. ఊషరక్షేత్రమున సస్యము వృద్ధికి రాదు. కావున హృదయ నిర్మలత్వమునకు వలసిన సాధనలు (Ethical training) జీవునకు ప్రప్రథమున అత్యంతావశ్యకములు. ఈ సత్యమును గుర్తెఱిగియే గీతా చార్యుడు శీలనిర్మాణము (Character building) నకు విశేష ప్రాధాన్యమునొసంగుచుపోయెను.

సాధ్య వస్తువగు పరమాత్మయందు గల ప్రీతిలో ఏ ఒక భాగమైనను సాధనయందు వినియోగింపబడినచో లక్ష్యము కరతలామలకమై పోవును. కానీ జనులట్లు చేయుట లేదు. దేవుడు గొప్పవాడైనను ఆ గొప్ప తనము ఆ పవిత్రత, జీవునకు గూడ కలిగినపుడే మోక్షము సిద్ధించును. లేకున్న దేవునకు, జీవునకు మధ్య గల అఖాతము అట్లే యుండిపోవును.

"సత్త్వపురుషయో శుద్ధియేవకైవల్యమ్"

'చిత్తము పరమాత్మతో సమానమైన నిర్మలత్వము నొందుటయే మోక్షము' అని పతంజలి మహర్షి నుడివియున్నాడు. కాబట్టి చిత్త నైర్మల్యమునకు కావలసిన పరికరములను, సాధనసంపత్తిని ముముక్షువు తప్పక గ్రహింపవలసియున్నాడు. భారతదేశము తన పూర్వపు ఔన్నత్యమును ఇపుడు పొందజాలకపోవుటకు కారణము లక్ష్యమునందు గల ఆసక్తి లక్ష్యసాధనయందు లేకపోవుటయేయనియు, సిద్ధాంతము నందుగల ప్రీతి ఆచరణయందు కానుపింపకపోవుటయేయనియు, సాధ్య వస్తువు నందు గల ప్రేమ సాధనయందు లుప్తమగుటయేయనియు, అనుష్ఠాన వేదాంతము తగ్గి 'వాచా' వేదాంతం ప్రబలుటయేయనియు జనులు





జ్ఞప్తియందుంచుకొనవలెను. ఈ పద్ధతి గీతాచార్యునకు సరిపడదు. కనుకనే జ్ఞేయమును తక్కువగ జెప్పి జ్ఞానమును విస్తారముగ గీత యందు ప్రతిపాదించెను. ధ్యేయమును రవ్వంతజెప్పి ధ్యానమును మిక్కుటముగ బోధించెను. 'సాధ్యము'ను ఒకింత ప్రతిపాదించి 'సాధన'ను బహుళముగ ప్రచారము చేసెను. గీతాబోధలందు సాధకుడు మొట్టమొదట గ్రహించవలసిన పరమరహస్యమిదియే అయియున్నది. గీత ఆచరణాత్మక విజ్ఞానము (Practical Science) అని యెల్లరును గుర్తెఱుగుదురుగాక!

## గీత వ్యవహారమును వేదాంత స్థాయికి కొనిపోవుట

"కర్మ చెడ్డది కాదు. వ్యవహారము దూష్యము కాదు. నీ దృష్టిని పవిత్ర మొనర్చుకొనుము. అత్తఱి నీవు చేయు కర్మ మహాయజ్ఞమై భాసించును. నీ భావమును శుద్ధపరచుకొనుము. అత్తఱి నీవు చేయు వ్యవహారము నిశ్శ్రేయసకరమై చెన్నొందును" అని గీత ఘోషించుచున్నది. కర్మ చేయక ఒక్క క్షణమైనను మనుజుడుండజాలడు. కావున కర్మను దూషించుచు, నిషేధించుచు చేయు బోధలు సామాన్యునకు ప్రయోజనకరములుగ నుండవు. పైగా అట్టి బోధలచేనతడు అకర్మణ్యుడుగ, జడప్రాయుడుగ తయారగును. జీవితము నిరర్థకమైపోవును. లోకములో నూటికి తొంబది తొమ్మిది మంది గృహస్థులుగను, బ్రహ్మచారులుగనున్నారు. వారు కర్మను పరిత్యజింపలేరు. సర్వసంగ పరిత్యాగము చేసి ఏకాంతమున కాలము గడపు సన్యాసులు, సాధువులు చాలా అరుదుగా నున్నారు. కావున ఎక్కువ మందికి ఉపకరించు బోధయే ఇపుడు కావలసియున్నది. ఈ విషయము లన్నియు గీతాచార్యుడు చక్కగ ఆలోచించి, వ్యవహారమును దూషించక, దానిని పవిత్రమొనర్చు ఉపాయములన్వేషింపదొడగెను. మరియు అట్టి వ్యవహారము ద్వారా, కర్మాచరణ ద్వారా చిత్తశుద్ధిని సంపాదించి క్రమముగ జ్ఞానానుభవమును బడసి మోక్షమును జెందవచ్చునని

యాతడు బాహాటముగ ప్రకటించెను.

"స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతిమానవః" 'తమ తమ కర్మల ద్వారా పరమాత్మనర్చించి మానవుడు ముక్తినొందగలడు" అని భాగవానుడు వాక్కిచ్చెను. ఇందులకు ప్రజల దృష్టాంతము అర్జునుడేయగును. ఏల యనిన 'నేను యుద్ధమును చేయను; నాకు రాజ్యము వలదు; జోలె తీసుకొని ఏకాంతమునకు బోయి భిక్షాన్నము భుజించుచు కాలక్షేపము చేసెదన'ని పలికిన అర్జునుడు శ్రీకృష్ణమూర్తి యొక్క దివ్య బోధలచే కర్మ రంగమున దుమికి, యుద్ధము చేసి, 'నేనేమియు చేయలేదు' అను నిర్లిప్తభావము కలవాడై, భయంకర సంగ్రామమును పవిత్ర యజ్ఞముగా మార్చివైచెను. శ్రీకృష్ణుని ముందు పెట్టుకొని అర్జునుడు యుద్ధమను వ్యవహారమును నడిపెను. వ్యవహారము మోక్షసోపానముగ పరిణమించుటకు ఉపాయమిదియే అయియున్నది. (భగవదున్ముఖత్వమే). భగవంతుని స్మరించుచు ఆ కార్యమును చేయుటయే ముక్తికి మార్గము.

"మామనుస్మర యుధ్యచ"

'నన్ను స్మరించుచు యుద్ధము చేయుము' - ఇదియే కర్మ రహస్యము. యుద్ధము చేయుట గొప్పది కాదు. దేవుని స్మరించుచు యుద్ధము చేయుట గొప్ప ఫలమును ఈశ్వరార్పణము చేసి కార్యమొనర్చుట గొప్పది. అపుడు 'కర్మ' కర్మగానుండక 'కర్మయోగము'గా మారిపోవును. (Work will be transformed into worship) అత్తఱి ఏకాంతమున సమాధి నిష్ఠయందుండు యోగి పుంగవునకు, ప్రపంచ మధ్యమున వివిధ కార్యకలాపములందు నిమగ్నుడగు కర్మిష్ఠునకు ఒకే ఫలము లభించును. ఆత్మశాంతి ఇరువురికిని సంప్రాప్తించును. భగవద్గీత బోధించిన తత్త్వమిదియే. లోకములో కొన్ని శాస్త్రములు కర్మను పూర్తిగ నిషేధించుచున్నవి. అవి నివృత్తి మార్గమునే ఎక్కువగ ప్రోత్సహించుచున్నవి. మరికొన్ని





శాస్త్రములు కర్మను లెస్సగ ప్రోత్సహించుచున్నవి. అవి ప్రవృత్తినే ఎక్కువగా బలపరచుచుండును. కానీ గీత అటు ప్రవృత్తికాక, ఇటు నివృత్తికాక మధ్య మార్గమును కనిపెట్టినది. అది అందరికిని ఆచరణ యోగ్యముగ నున్నది. శరీరము ప్రవృత్తియందున్నను మనస్సును నివృత్తి యందుంచు కొనుము అని గీత బోధించుచున్నది. ఈ గీతాభావమునాధార పరచుకొనియే జనకుడు రాజ్యమేలెను. విష్ణుమూర్తి ముల్లోకములను పాలింపగల్గెను. ఇవ్విధముగ గీతాచార్యుడు వేదాంతులు సామాన్యముగ ఏవగించుకొనుచుండు లోకవ్యవహారమునకు క్రొత్త రూపమిచ్చి దానికి పరమార్థ స్థాయిని కల్పించెను. ఇట్టి సిద్ధాంతమును మున్నెవరును, ఏ శాస్త్రమును ప్రతిపాదించలేదు. కనుకనే గీతకును, గీతాచార్యునకును ఇంత ఘనత చేకూరినది.

## ఈ మాత్రం చేయలేమా?

- ఏ.పి.జె. అబ్దుల్ కలాం

**(నా దేశ యువజనులారా)**

అన్ని పనుల్లోకి ఉత్తమమైనది? తోటి మనిషి హృదయాన్ని స్పందింపజేసి సంతోషపరచడం, ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడం, గాయపడ్డ వారిని ఆదుకోవడం, దుఃఖితుల దుఃఖాన్ని చల్లపరచడం, దెబ్బతిన్న వారిని ఓదార్చడం.

భగవంతుడి సృష్టిలో ప్రతి ప్రాణి ఆయన కుటుంబంలో భాగమే, సృష్టిలో ప్రతి ఒక్క ప్రాణి కోసం ఎవరు తపిస్తారో అతడే దేవుడికెక్కువ సన్నిహితుడు.

ఇవి ప్రవక్త మహమ్మద్ ప్రవచనాలు. నాకీ మాటలు గుర్తు చేసినాయన తమిళనాడుకి చెందిన ఘనాపాఠీ అయిన ఒక దీక్షితారుకి ముని మనమడు వై.ఎస్. రాజన్. అటువంటి దృక్పథం మన దేశంలో మాత్రమే

సాధ్యం. ఋగ్వేదమేమందో గుర్తు చేసుకుందాం. 'ఆనో భద్రః క్రతవోయంతు విశ్వతః' శుభప్రదమైన ఆలోచలన్నివైపుల నుంచీ మాకందుగాక అని.

మా కుటుంబంలో జరిగిన సంఘటనొకటి గుర్తొస్తోంది. మా తాతనీ, ముత్తాతనీ రామేశ్వరంలో అత్యంత ఉత్తములుగా గుర్తించేవారు. రామేశ్వర మంటేనే రాముడు రావణుడిపైన సంగ్రామాన్ని ప్రకటించిన పుణ్యస్థలం. ప్రతియేటా సీతారాముల కళ్యాణాన్ని జరపడం ద్వారా ఆ సంఘటనని గుర్తు చేసుకొని ఊరు పండుగ చేసుకునేది. రామతీర్థమనే కొలనులో అలంకృత ఉత్సవ విగ్రహాల్ని ఊరేగింపుగా తీసుకుపోవడానికి మా ముత్తాత తెప్ప కట్టేవాడు. ఆ కొలను చాలా లోతుగా ఉండేది. ఆ కొలను మధ్య తేలియాడే ఆ తెప్ప మీద చిన్న మంటపమూ, ఆ మంటపము మీద సుందర మైన బంగారు నగలతో అలంకరించబడ్డ శ్రీ రామచంద్ర మూర్తి విగ్రహమూ ఉండేది. ఆ కళ్యాణాన్ని చూడటానికి రామేశ్వరమంతా ఒక్క చోట చేరుతుంది.

ఒక ఏడాది మా ముత్తాత ఆ వేడుకని తిలకిస్తుండగా దుర్ఘటనొకటి సంభవించింది. ఆ విగ్రహం తల్లకిందులై నీట మునిగిపోయింది. అంతే ఆయన ఒక్క క్షణం కూడా తటపటాయించకుండా నీళ్లల్లో దూకి ఆ విగ్రహాన్ని పైకి తీసుకొచ్చాడు. ఊరు ఊరంతా ఆ దృశ్యాన్ని చూసింది. అప్పుడు అగ్రతాంబూలాన్ని దేవాలయ పూజారులు మా కుటుంబానికి అనుగ్రహించారు. ఆ విగ్రహాలు తిరిగి దొరికినందుకు సర్వేశ్వరునికి కృతజ్ఞతాస్తుతులర్పిస్తూ రామేశ్వరం మసీదులో మా వాళ్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మా కుటుంబం పైన దేవుడి అనుగ్రహానికి నమోవాకా లర్పించారు.

మానవ సౌభ్రాతృత్వానికి ప్రకాశవంతమైన ఉదాహరణగా ఈ సంఘటనని నేనెప్పుడూ భావిస్తాను. ముఖ్యంగా నేటి భారతం ఈ ఉదా హరణ నుంచి గ్రహించవలసినది ఉందనుకుంటాను. మనం ఎవ్వర మయినప్పటికీ మనలో ప్రతి ఒక్కరం అటువంటి సోదరత్వాన్ని పెంచి పోషించడానికి ఏకొంతో కృషి చెయ్యలేమా?



సాయి వాణి

# మాతృసంస్థ కబుర్లు

## శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమం-సత్తెనపల్లి శాఖ

శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమంలో సెప్టెంబరు 26వ తేదీన శరన్నవరాత్రి పూజా కార్యక్రమాలు ప్రారంభమైనాయి. అభిజిత్ లగ్నంలో కలశస్థాపన చేసి, అఖండ దీప ప్రజ్వలన చేసాము. అమ్మ వారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, మొదటిరోజు దుర్గాదేవి అవతారంగా అలంకరణ చేసి, కుంకుమ పూజ జరిపించాము. సాయంత్రం గం.7.00లకు బతుకమ్మను పేర్చి పూజలు జరిపించాము. ఆశ్రమ పరిసరాలలో ఉన్న ముత్తైయిదవలు, కుమారిలు ఈ కార్యక్రమములో పాల్గొని అమ్మ వారి చుట్టూ బతుకమ్మ ఆటలు ఆడి, ప్రసాదాలు నివేదించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. తొమ్మిది రోజులు అమ్మ వారు వివిధ రకాల అలంకారాలలో భక్తుల పూజలందుకున్నారు. భక్తుల కోలాహలంతో బతుకమ్మ ఆటలతో ఆశ్రమం అంతా 10 రోజులు ఆధ్యాత్మిక ఆనందంతో విరాజిల్లినది. రెండవ రోజు బాలా త్రిపురసుందరి దేవిగా, మూడవ రోజు గాయత్రీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. నాలుగవ రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారము. కావున ఆరోజు భక్తులు తెచ్చిన వివిధ రకాల శాఖములతో అమ్మవారిని శాఖాంబరిగా అలంకారము చేసాము. ఈ అలంకారము భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది. మరుసటి రోజు అమ్మ వారికి అలంకరించిన శాఖములను భక్తులకు ప్రసాదంగా పంచాము. అయిదవ రోజు లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఆరవ రోజు మహాలక్ష్మి అవతారము. అమ్మవారు వివిధ రకాల గాజులతో అలంకరింపబడి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులందరు కనులారా అమ్మవారిని దర్శించి హారతు లిచ్చి తరించారు. ఏడవ రోజు అమ్మ వారు సరస్వతిదేవిగా శ్వేత వస్త్ర ధారణతో ప్రసన్నమైన చూపులతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం

గం.10.00లకు ఆశ్రమ పరిసరాలలో ఉన్న బాలబాలికల చేత పూజారిగారు శాస్త్రోక్తంగా అమ్మవారి పూజ చేయించారు. పిల్లలందరూ శ్రద్ధాభక్తులతో అమ్మ వారిని పూజించి చదువు బాగా రావాలని అమ్మవారిని వేడుకున్నారు. ప్రసాద వితరణతో, పూజలో పాల్గొన్న పిల్లలకు పుస్తకము, పెన్ను పంపిణీతో కార్యక్రమం నిర్విఘ్నంగా ముగిసినది. ఎనిమిదో రోజు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. తొమ్మిదో రోజు మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారు రౌద్రరూపం అలంకారము భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది. పదవ రోజు రాజరాజేశ్వరిగా ప్రసన్నమైన చూపులతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. విజయదశమి రోజు సాయంత్రం బాబా మందిరంలో సమాధి ఉత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలంకరణతో తయారుచేసిన బాబా వారి సమాధి విశేషంగా ఆకట్టుకున్నది. భక్తులు ఆనందోత్సాహాలతో సమాధి చుట్టూ కోలాటంతో నృత్యం చేసారు. అనంతరం పూజారిగారు సాయినాధుల వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం గం.9.00ల నుండి బాబా వారి సచ్చరిత్ర పారాయణ చేసారు. నూతన వస్త్రాలతో కిరీటధారులై సాయినాథుల వారు నా సమాధి నుండి సర్వకార్యాలు నిర్వహిస్తానని చెప్పినట్లుగా, చిరుమందహాసంతో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రసాద వితరణతో కార్యక్రమం ఘనంగా ముగిసినది. 6వ తేదీ సాయంత్రం అమ్మ వారి తెప్పోత్సవం కార్యక్రమం దిగ్విజయంగా జరిగినది. తొమ్మిది రోజులు పూజలందుకున్న అమ్మవారు, ప్రసన్న వదనంతో పూజమాలాలంకృతులై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి గం.8.00లకు పూల బతుకమ్మలు, బతుకు అమ్మవారులు వెంటరాగా భక్త జన నీరాజనాలందుకొని అమ్మవారు తెప్పోత్సవానికి తరలివెళ్ళారు. సత్తెనపల్లి శివారులోని పెద్ద కాలువలో శాస్త్రోక్తంగా బతుకమ్మలను, అమ్మవారిని నిమజ్జనం చేసాము. కార్యక్రమం ఆద్యంతం ఎటువంటి ఆటంకం లేకుండా గురుకృపాకటాక్షాలతో నిర్విఘ్నంగా జరిగినది.





# పరిప్రశ్న

**- కీ.శే. శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

**ప్రశ్న: మృత్యువు తప్పదని తెలిసి కూడా మృత్యుంజయ జపం చేయాలనీ, చేస్తే మృత్యువును జయించవచ్చునని చెప్పడమేమిటి? - ఒక జిజ్ఞాసువు**

**జవాబు :** చాలా మంచి ప్రశ్న! మృత్యువును జయించవచ్చని ఋషులు చెప్పిన భావమొకటైతే యీనాటి 'పెద్దలు' చెప్పే భావం వేరొకటి. అసలు పండితులు, జ్ఞానుల లక్షణం వేరు. "గతా సూనగతా సూన్శనాను శోచంతి పండితాః" అన్నాడు కృష్ణుడు (భగవద్గీత), జ్ఞానులు చనిపోవడం గురించి, చనిపోక పోవడం గురించి చింతించరు - అని గీత చెప్పినది. కనుక చనిపోతామని భయపడే వారే దానిని తప్పకునే యత్నం చేసి విఫలులవుతారు. చనిపోయేది దేహమే. పుట్టిన ప్రతీదీ ఏనాటికైనా చావవలసినదే (గీత). ఈ ప్రకృతి మాత్రమే భగవంతుని, శాసనం-అదే విధి. దానికి రాముడు, కృష్ణుడూ, పామరుడూ అందరూ తల ఒగ్గవలసినదే.

అయితే నశించేది దేహమే, దానికి జన్మ వున్నది గనుక మృత్యువు వుండవలసిందే. అయితే జీవుడు కేవలం చైతన్య స్వరూపి గనుక అతనికి మరణము దేహాలను నిర్మించుకోవడం, శిథిలం కాగానే విడిచివేయడమూ మాత్రమే. ఇది ఆ జీవి అజ్ఞానంలో వున్నంతవరకు జరుగవలసినదే. నిరంతర సాధన వలన తాను నిజానికి సర్వగత మైన బ్రహ్మమేనన్న జ్ఞానం కల్గిన నాడు - తాను పరిమితుడూ, అల్ప జ్ఞుడూ అన్న భ్రాంతి వీడుతుంది. అంతటితో జననం నుండీ, మరణం నుండీ - అంటే ఒక శరీరాన్ని నిర్మించుకోవడం, దానిని నశింప జేసుకోవడమనే అవసరం నుండి విడివడుతూ-జ్ఞానమూ, సాధనా

జీవించియుండగానే సాధ్యం గనుక, జ్ఞానం కల్గితేగాని దుఃఖ రాహిత్యం కలగదు గనుక, అది కలిగే వరకూ జీవుడు దేహాలను ధరిస్తూ విడుస్తూ వుండవలసినదే.

అనేక జన్మల సాధన వలన క్రమంగా జ్ఞానం పక్వమవుతూ వచ్చి, అది పూర్తి పక్వస్థితినందినపుడు - ఇక జన్మించవలసిన అగత్యం నుండి విడివడుతాడు. అంటే తిరిగి తిరిగి మరణించవలసిన దుస్థితి నుండి విడివడుతాడు. పరీక్ష పాసవడంతో మరల పరీక్షకు హాజరు కావలసిన, మరల చదువవలసిన అగత్యం నుండి విడివడు తాడు విద్యార్థి. ఇదీ అంతే.

పూర్ణమైన ఆత్మజ్ఞానం వలన యిలా మృత్యువు నుండి విడవడు తాడనీ, అట్టి పక్వజ్ఞానం త్రయంబకుడైన పరమేశ్వరుణ్ణి 'యజనం' చేసినందువలన కలుగుతుందనీ చెబుతుంది మృత్యుంజయ మంత్రం. యజనం అంటే సర్వవిధములా, సర్వకాల సర్వావస్థల యందూ ఆరాధించడం. అంటే శరీరంతో ఆయనకు ప్రదక్షిణ, పూజ, నమస్కారాదులు: నోటితో ఆయనను స్తుతించడం, నామం జపించడం, ఆయన గూర్చి వినడం, సకల జీవులనూ యథాశక్తి సేవించడం. శరీరాన్ని అధర్మ కార్యాలలో వినియోగించకపోవడం, శారీరక యజనం. మనస్సును సదా ధర్మబద్ధంగా ఉంచుతూ, వివేకంతో యోచించి వ్యర్థ వ్యామోహాల పట్ల వైరాగ్యం చెందటం, భగవన్నియతమైన సుఖదుఃఖాలను, మరణాదులనూ గూర్చి వ్యర్థంగా చింతించకపోవడం, సచ్చింతనా, ధ్యానము - యివి మానసిక 'యజనం' - భగవద్గీత యీ రెంటినీ ద్రవ్యయజ్ఞాలు, తపో యజ్ఞాలు అన్నది. దేహమానసాదులతో సద్గురువును సేవించి, పరిప్రశ్న చేసి యీ విధానాన్ని తెలుసుకొని ఆచరించాలి. ఇలా చేస్తే జ్ఞాన పరిపాకం కల్గి మృత్యువు నుండి విడివడతాము. పండిన





దోసకాయ చెట్టుతో దానికి గల బంధం (తొడిమ) నుండి దానికై అదే విడివడినట్లు. అనన్యమైన ఈశ్వరధ్యానం చేయమని యీ మంత్రార్థం. ఆ మంత్రం చెప్పినట్లు చేయకుండా దానిని ఉచ్ఛరిస్తే సరిపోతుందా? వైద్యుడు వ్రాసిచ్చిన మందులు సంపాదించి సేవించిన ఫలితం ఆయనిచ్చిన చీటీని వల్లిస్తే వస్తుందా? పైన వివరించినటువంటి సదాచారంతో గూడిన మంత్ర జపాదులు చేస్తేనే మృత్యురహిత స్థితి కలుగుతుందని భగవద్గీత శ్రద్ధాత్రయ విభాగ యోగం ప్రమాణం.

# కర్మ ఫలితాలు

**- గురుదేవులు**

చాలామంది జిజ్ఞాసువులకు ఒక ప్రశ్న సాధారణంగా ఎదురౌతూ ఉంటుంది. ఎంతో మంచి ప్రవర్తన కలిగి పుణ్యాత్ములనిపించుకున్నవారు అనేక కష్టాలు పడుతూ కన్పిస్తున్నారు. దుర్మార్గపు ప్రవర్తన కలిగి ప్రస్తుత రాజకీయ నాయకత్వంలోనో, వివిధ రకాలైన దుర్మార్గపు చర్యలతోనో బాగా డబ్బు గడించిన వారు సుఖభోగాలతో విలసిల్లుతున్నారు. దీనికి కారణమేమై ఉండవచ్చును? పుణ్యకార్యాల ఫలితం కష్టాలు అనుభవించట మేనా? - అని.

ఇలాంటి ప్రశ్నే పార్వతీదేవి పరమశివుని అడిగినట్లుగా మహాభారతం అనుశాసనిక పర్వంలో కన్పిస్తుంది.

ఇప్పుడు అనుభవిస్తున్న కష్టాలుగానీ, సుఖాలుగానీ ఈ జన్మలో చేసిన, చేస్తున్న కర్మలకు ఫలితం కాదు. వీటి ఫలితాలు అనుభవించాల్సినది రాబోయే జన్మలలో, ఇప్పుడు మనం చూస్తున్నవన్నీ గత జన్మలలో చేసిన కర్మల ఫలితాలు మాత్రమే.

ఇప్పుడు అనుభవిస్తున్న కష్టాలుగానీ, సుఖాలుగానీ ఈ జన్మలో చేసిన, చేస్తున్న కర్మలకు ఫలితం కాదు. వీటి ఫలితాలు అనుభవించాల్సినది రాబోయే జన్మలలో. ఇప్పుడు మనం చూస్తున్నవన్నీ గత జన్మలలో చేసిన కర్మల ఫలితాలు మాత్రమే.

మనం చేసే ప్రతి చర్యకు అంతే స్థాయిలో ప్రతి చర్య (రియాక్షన్) అనుభవించక తప్పదు. ఇది ప్రకృతి నియమం. రాబోయే జన్మలలో మంచి జరగాలని కోరేవాడు మంచి పనులే చేయాలి. అహంకారంలో దుర్మార్గ ప్రవర్తనకు లొంగినవాడు తదుపరి జన్మలలో కష్టాలు అనుభవింపక తప్పదు.

పూర్వజన్మలో లేమిలో దుఃఖిస్తున్న బంధువులను, ఆత్మీయులను తగిన దాన గుణంతో ఆదుకున్న వారికి ఈ జన్మలో ఎడతెగని సుఖ సంపత్తి లభిస్తుంది.

దారుణ లోభంతో కుంచించుకుపోయిన కుత్సితులు సహించరాని దుర్గతితో దుఃఖిస్తున్నారు. భగవంతుడు ఒక గొప్ప న్యాయనిర్ణేత మాత్రమే- ఆయనకు ఎవ్వరి పట్ల రాగద్వేషాలు కానీ, ఆగ్రహ అనుగ్రహాలు కానీ ఉండవు. జీవుడు చేసిన కర్మను అనుసరించి ఫలితాలను మాత్రమే ప్రసాదిస్తూ ఉంటారు.

పుష్కలంగా ధనమున్నా అనుభవించని కష్టాత్ములు వెనుకట పుట్టుకలో ఇతరులు ఎన్నెన్నో విధాల బలవంతపెట్టినపుడు మాత్రమే ఉపకారాలు చేసిన పరమలోభులు.

తమకు ఏ మాత్రం సొమ్ము లేకపోయినా ఇతరుల సహకారంతో అనుభవిస్తున్నవారు పూర్వజన్మలో పేదవారై అర్థులకు ఏదో విధంగా సాయ పడాలని తపించిన సత్పురుషులు. ఎవరికైతే అనాయాసంగా ధనం చేకూరుతున్నదో వారు తమంత తామే పాత్రులయిన వారిని ఆహ్వానించి దానములిచ్చిన దాతలు.

ఎన్నెన్ని విధాల కష్టించినా ధనము ఏ మాత్రము చేకూరని దురదృష్ట వంతులు పూర్వజన్మలో యాచకులను అదిగో ఇదిగో అని తిప్పి చివరకు నిరాదరించిన పాపులు.





మహాధనవంతులై కూడా నిరంతర రోగాల వల్ల భోగాలు అనుభవించ లేనివారు పూర్వజన్మలో గొప్ప ఐశ్వర్యవంతులైనా దానధర్మాల మాట తలపెట్టక మరణ సమయంలో మాత్రమే దానాలు చేసిన అవివేకులు.

మహా సౌందర్యవంతులు వెనుకటి పుట్టుకలో మాంసం విసర్జించిన మహనీయులు. రూప విహీనులు పూర్వం సుందరులై కురూపుల నపహ రించిన దురహంకార దూషితులు. భార్య యెడల మిక్కిలి అన్యోన్యతతో చిరకాలం సౌఖ్యాలు అనుభవించిన వ్యక్తి పూర్వం పరదాలవైపు కన్నెత్తి చూడని సత్పురుషుడు. అనుకూలత లేని దాంపత్యంతో అలమటించి అనతికాలంలోనే భార్యా వియోగంతో దుఃఖిస్తున్న మానవుడు. వెనుకటి జన్మలో భార్యను ఏ మాత్రం సుఖపెట్టని వాడని గుర్తించవలెను. మహనీయ విజ్ఞాన ఖనియైనా లేమితో సతమతమౌతున్న నరుడు. పూర్వం సిరి సంపదలున్నా మరి దానం మాటయే తలపెట్టని పరమలోభి. విత్త సంపద ఉన్నా తగినంత బుద్ధి సంపత్తి లేని మానవుడు గత జన్మలో ప్రజ్ఞ లేకపోయినా కారుణ్య దృష్టితో దీనులను ఆదరించిన ఆర్ద్రహృదయుడు.

# 'V' FOR VIDYA

## - From "Our Tomorrow"

## - Written by Sri Vakati Pandu Ranga Rao

"The Vedas are an incomparable source of knowledge. The language in which they have been written is very exact and clear from every point of view. You cannot find even one flaw or exception in the grammar. The Vedas are not just a scriptural text, they are a form of literature. Just as in science there are so many subjects and

classifications, in the same way, the Vedas include so may branches and topics.

"The most ancient is ..... Rigveda, containing the myths of Aryan gods and descriptions of sacrifices and other rites. The Second Veda is Yajurveda, which contains formulas for the sacrifices, as well as for the sacrifices, as well as for everything which man does in the path of life. The third .... Saamavedas ... was the origin of music.

"The fourth Veda is Atharva Veda and it comprises all the sciences. It contains tantra and Yoga as well as medicine, surgery, herbology, minerals, archery, magic, sexual science and many, more topics .... The four Vedas deal with hundreds of topics, They discuss everything in life and after life. They refer to this planet that we live on and the different constellations beyond our solar system. They do not merely discuss politics and empires, they tell us about geography and history as well as the absolute form of creation.

"Although the original language of the Vedas is Sanskrit, they are now available in translations all over the world, however the translations which are done in the early part of the century are generally not as perfect as those which came later. This is because the first western scholars were very limited as far as guidance was concerned. When Max Mullar came to India for research, the intellectual class was totally blinded by Western imperialism and had forgotten their own heritage. Only the brahmins could help him and they donot know english.





So an interpreter had no background in the subject. There fore, these earlier translations were often inept" - observes Swamy Satyananda Saraswati, a disciple of Swamy Sivananda Saraswathi and the founder of the Bihar School of Yoga at munger.

Now we will take up some examples from different sources to have an idea of the wide range of knowledge and corresponding terminology used by the seers and sages of India.

First the concept of time and life as one unity; sage Kapila's explanation about the process of creation and purpose of man to his mother Devahuti forms an exciting chapter loaded with information now being termed as sciences. This is from the third skanda of Srimad Andhra Bhagavatam.

"That dynamic principle which is created by God's action is known as time; this dynamic principle enclosed in the bodies of the animate is called 'Parusha' (or life) and the same principle extending without is called as time".

If one remembers that breath is life, and that human life span is measured in number of breaths (inhalation and exhalations) according to Yoga Sastra, one can understand the full implication of the above statement which says that what we call life is only another expression of time why this reminds us of the Einsteian concept of the energy and matter is something that better minds than this author's should ponder and prove.